ఉన్నతాధికారుల పొరపాటు

- తాసీల్దార్లకు గ్రహపాటు
- 8 నెలలుగా జీతం లేక సతమతం

దేవరకద్ర రూరల్(కౌకుంట్ల), ఏప్రిల్ 7 : అధికారుల తప్పిదంతో కౌకుంట్ల తాసీల్దార్ ఎల్లన్నకు శాపంగా మారింది. పదోన్నతి కల్పించి సిబ్బంది లేని కొత్త మండలానికి పోస్టింగ్ ఇవ్వగా, వేతనం అందక సతమతమవుతున్నాడు. అసెంబ్లీ ఎన్నికల ముందు గత అగస్టు నెలలో బదిలీపై వచ్చిన ఆయనకు 8 నెలలుగా జీతం అందలేదు. పే బిల్ సౌకర్యం లేకపోవడంతో వేతనం జమ కావడం లేదు. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో 8 నెలలుగా ఆ అధికారి ఆర్థిక ఇబ్బందులనుఎదు ర్కొంటున్నారు.

కౌకుంట్ల రెవెన్యూ కార్యాలయం

కౌకుంట్ల మండలానికి ఇన్‌చార్జిలే..

2022 నవంబర్ 30న దేవరకద్ర మండలం నుంచి 6, చిన్నచింతకుంట మండలం నుంచి 4, మొత్తం 10 రెవెన్యూ గ్రామాలను వేరు చేస్తూ కౌకుంట్ల కేంద్రంగా కొత్త మండలాన్ని ఏర్పాటు చేశారు. కౌకుంట్ల మండలంగా ఏర్పడినప్పటికీ తగినంత సిబ్బంది(క్యాడర్ స్ట్రెంత్)ని కేటాయించలేదు. మండలంలో కార్యకలాపాలను కొనసాగేందుకు వీలుగా అప్పట్లో దేవరకద్ర మండలానికి చెందిన డిప్యూటీ తాసీల్దార్ శివరాజును డిప్యూటేషన్‌పై ఇన్‌చార్జి తాసీల్దార్‌గా, మిడ్జిల్ మండలం నుంచి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను నియమించారు. అనంతరం మిడ్జిల్ మండల తాసీల్దార్ అక్కడి నుంచి డిప్యూటేషన్‌పై కౌకుంట్లకు వచ్చారు. వారితో పాలన కొనసాగుతూ వచ్చింది. వారు వారికి ఇతర మండలాల నుంచి వేతనం పొందేవారు.

పదోన్నతిపై తాసీల్దార్‌గా వచ్చి..

అసెంబ్లీ సాధారణ ఎన్నికల దృష్ట్యా గతేడాది ఆగస్టు నెలలో గద్వాల జిల్లా కలెక్టరేట్‌లో తాసీల్దార్ క్యాడర్ విధులు నిర్వహిస్తున్న ఎల్లన్న పదోన్నతిపై మహబూబ్‌నగర్ జిల్లా కౌకుంట్ల మండలానికి తాసీల్దార్‌గా నియమించడం ఆయనకు శాపంగా మారింది. అప్పట్లో జిల్లా ఉన్నతాధికారులు చేసిన తప్పిదానికి 8 నెలలుగా ఆయనకు వేతనం అందడం లేదు. కేడర్ స్ట్రెంత్ లేని మండలానికి తాసీల్దార్‌గా నియమించడం అధికారుల అవగాహన రాహిత్యానికి అద్దంపడుతున్నది. కేడర్ స్ట్రెంత్, పే బిల్ సౌకర్యంలేని మండలానికి తాసీల్దార్‌గా నియమించడంతో వేతనం లేక పలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. షుగర్ వ్యాధితోపాటు పలు అనారోగ్య సమస్య లు, అలాగే ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆందోళనలకు గురై గుండె సంబంధిత వ్యాధుల కు గురవుతానని మానసికంగా సతమతమవుతున్నాడు. మరికల్ మండలం గోటూర్‌కు చెందిన ఎల్లన్న భార్య, ముగ్గురు కూతుర్లతో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని వాసముంటూ, కౌకుంట్ల మండలానికి హాజరవుతున్నారు. తాసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ బాధ్యతలు నిర్వహిస్తుండడంతో ప్రతిరో జు కార్యాలయానికి హాజరుకావడం తప్పడంలేదు. దీంతోపాటు, సర్పంచుల కాలపరిమితి ముగియడంతో గ్రామాల పరిపాలన బాధ్యత లు ప్రత్యేక అధికారులకు అప్పగించారు. అం దులోభాగంగా ఎల్లన్నకు మూడు గ్రామాలకు ప్రత్యేక అధికారిగా నియమించారు. తనకు వేతనం రావడంలేదని భూ పరిపాలన శాఖ(సీసీఎల్ఏ)తోపాటు రెవెన్యూ అసోసియేషన్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి స్పందన లేదు. ప్రతి నెలా పిల్లల చదువులకయ్యే ఖర్చులు, ఇంటి అద్దె, ఈఎంఐలు, దవాఖాన ఖర్చులు, మందుల కొనుగోలు, కుటుంబ పోషణ నిర్వహణ తదితర ఖర్చులకు డబ్బులు లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి తాసీల్దార్‌కు వేతనాలు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని రెవె న్యూ ఉద్యోగుల సంఘంనాయకులు కోరుతున్నారు.

రోగులతో మర్యాదగా ప్రవర్తించాలి

- పేట ప్రభుత్వ జనరల్ దవాఖాన తనిఖీ చేసిన కలెక్టర్
- రక్త పరీక్షల కోసం పేషెంట్లను ప్రైవేట్ ల్యాబ్‌కు పంపడంపై ఆగ్రహం

రోగితో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట టౌన్, ఏప్రిల్ 7: దవాఖానలో రోగులతో మర్యాదగా ప్రవర్తించాలని కలెక్టర్ శ్రీహర్ష నర్సులకు సూచించారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జనరల్ దవాఖానను ఆయన తనిఖీ చేశారు. మెటర్నిటీ వార్డు, ఆపరేషన్ థియేటర్, సీ సెక్షన్ వార్డు, ఆర్థోపెడిక్, సర్జికల్, జీ వార్డు, జనరల్ వార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. డైట్ రూంలో మెనూను పరిశీలించి మెనూ ప్రకారం అరటిపండు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. మెనూ ప్రకారం ఇవ్వకపోతే నిర్వాహకులకు ఇచ్చే వేతనంలో కట్ చేయాలన్నారు. ఆర్థోపెడిక్ వార్డులో ఉన్న ఐదుగురు పేషంట్లలో ముగ్గురు పేషంట్లను రక్త పరీక్షల కోసం ప్రైవేట్ ల్యాబ్‌కు పంపించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేటు ల్యాబ్‌లో రక్త పరీక్షలకు ఎంతమేరకు ఖర్చయ్యాయో పేషంట్లను అడిగి తెలుసుకున్నారు. మరోసారి పునరావృతం కారాదని నర్సులను హెచ్చరించారు. అనంతరం దవాఖాన ఆవరణలో మరుగుదొడ్లు, స్నానపు గదులు వినియోగంలో ఉన్నాయో లేదో తెలుసుకున్నారు. విశ్రాంతి భవనంలో రోగుల బంధువుల కోసం అదనంగా ఫ్యాన్‌లు అమర్చాలన్నారు. దవాఖాన ఆవరణలో నీటి సరఫరా సరిగా లేకపోవడం, పవర్ బోరు ద్వారా ఉప్పు నీరు వస్తుందని తెలుసుకొని, ఆర్‌వోబీ ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేయాలని సూపరింటెండెంట్ రంజిత్‌కుమార్‌కు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఎంవో పావని, సిబ్బంది ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

భూత్పూర్, ఏప్రిల్ 7 : మండలంలోని అన్నాసాగర్ గ్రామానికి చెందిన గోపాలమ్మ అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందా రు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదివారం మృతురాలి ఇంటికి వెళ్లి ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కోఆప్షన్ సభ్యుడు ఖాజ, బీఆర్ఎస్ నాయకులు రాజారెడ్డి, సాబేర్ ఉన్నారు.

నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి

గండీడ్, ఏప్రిల్ 7: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన గండీడ్ మండలంలోని పెద్దవార్వల్, సల్కర్‌పేట్, జానంపల్లి గ్రామాల సమీపంలో చోటుచేసుకుంది. ఎస్సై శేఖర్‌రెడ్డి కథనం మేరకు.. చిన్నవార్వల్ గ్రామానికి చెందిన వెంకటయ్య శనివారం తన బైక్‌పై పెద్ద వార్వల్ నుంచి చిన్న వార్వల్‌కు వస్తుండగా బైక్ అదుపుతప్పి కింద పడడంతో తీవ్ర గాయాలు కాగా కుటుంబసభ్యులు ఆయనను మహబూబ్‌నగర్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం వెంకటయ్య మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన సల్కర్‌పేట్, జానంపల్లి గ్రామాల సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సల్కర్‌పేట్ గ్రామానికి చెందిన శివకుమార్ బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో కాలు విరిగింది. తీవ్ర గాయాలయ్యాయి. అలాగే జానంపల్లి కట్టెల మిషన్ వద్ద నంచర్ల గ్రామానికి చెందిన విశాల్, సాయి కళ్యాణ్ ఆటోలో కోస్గి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో ఇద్దరూ గాయపడ్డారు. వారిని 108 వాహనంలో కోస్గి, మహబూబ్‌నగర్ జిల్లా దవాఖానకు తరలించారు.

వ్యక్తికి రిమాండ్

మహ్మదాబాద్, ఏప్రిల్ 7: స్థల వివాదంలో వ్యక్తిపై దాడి చేయడంతో పూర్తి విచారణ అనంతరం దాడికి పాల్పడిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. గతనెల 5న గండీడ్ మండలం పెద్దవార్వల్‌కు చెందిన నారాయణ, ఇంటి స్థలం విషయంలో అదే గ్రామానికి చెందిన లక్ష్మయ్యపై దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు మహ్మదాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మెడికల్ రిపోర్టు ఆధారంగా ఆదివారం కావలి నారాయణను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఇల్లు లేని జర్నలిస్టులకు న్యాయం చేస్తాం

- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, ఏప్రిల్ 7: జర్నలిస్టులు అంటే సమాజంలో గౌరవం ఉందని, నిజాలను నిర్భయంగా రాసేవాళ్లే అసలైన జర్నలిస్టులని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్‌లోని డీసీసీబీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన టీయూడబ్ల్యూజే జిల్లా సర్వసభ్య సమావేశానికి ఆయన విశిష్ట అతిథిగా హాజరై మాట్లాడారు. ఇల్లులేని జర్నలిస్టులకు న్యాయం చేస్తామని, ఇంటి స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరాహత్‌అలీతో కలిసి ఎమ్మెల్యేను మెమొంటో, శాలువాతో ఘనంగా సత్కరించారు. గతంలో ఇండ్ల విషయంలో జరిగిన అవకతవకల గురించి యూనియన్ సభ్యులు ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన సంపాదకుడు గోల్కొండ ప్రతిక వ్యవస్థాపకుడు సురవరం ప్రతాప్‌రెడ్డి ఆదర్శాలను ముం దుకు తీసుకెళ్తామన్నారు. జర్నలిస్టుల కొంత భాగస్వామ్యంతో ప్రైవేట్ దవాఖానల్లో క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ అందించేందుకు, జర్నలిస్టుల పిల్లల విద్య రాయితీకి కృషి చేస్తున్నట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ మున్సిపల్ చైర్మ న్ ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ జర్నలిస్టులు చాలామందికి ఆర్థిక, ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఉన్నాయన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు పేపర్ శ్రీను, దత్తు, రామాంజనేయులు, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యసేవలకు కృతజ్ఞతలు

- మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్

శిబిరంలో పాల్గొన్న సభ్యులు

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 7: జిల్లా కేంద్రంలోని న్యూగంజ్‌లో ఆదివారం రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య సేవ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, వార్డు కౌన్సిలర్ నర్సింహులు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో సేవాభావం కలిగి ఉండాలని, ఆపదలో ఉన్న వ్యక్తికి అండగా నిలవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఈ సందర్భంగా ఉచిత వైద్యంతో పాటు మందులు పంపిణీ చేసిన రజక సంఘం నాయకులు, ఎంకే దవాఖాన సిబ్బంది కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మరెన్నో కార్యక్రమాలు చేపట్టి ప్రజల ఆరోగ్యంపట్ల అవగాహన కల్పిస్తామని జాతీయ కన్వీనర్ శ్రీనివాస్, రజక ఆర్ఆర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగన్న, పట్టణ అధ్యక్షుడు రాజు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యం, శివన్న, ఎంకే హాస్పిటల్ మేనేజర్ బాలు, బీసీ సమా జ్ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు కృష్ణ, శివకుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సంఘటితంగా పోరాటం చేయాలి

నారాయణపేట టౌన్, ఏప్రిల్ 7: దివ్యాంగుల హక్కుల కోసం సంఘటితంగా పోరాటం చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర కార్యదర్శి అడివయ్య, జిల్లా అధ్యక్షుడు కాశప్ప అన్నారు. ఆదివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఎన్‌పీఆర్‌డీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. దివ్యాంగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈనెల 30, 31 తేదీల్లో జిల్లా ద్వితీయ మహాసభలు నిర్వహిస్తున్నామని, దివ్యాంగులు అధిక సంఖ్యలో హాజరై మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ జిల్లా కార్యదర్శి రాధమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు బాబు, నర్సప్ప, సహాయ కార్యదర్శులు కృష్ణ, రవి, పెంటయ్య, సత్యనారాయణరెడ్డి, రంగమ్మ, నీలమ్మ పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

నారాయణపేటరూరల్, ఏప్రిల్ 7: పేట మండలంలోని లక్ష్మీపూర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం రాత్రి పాఠశాల వార్షికోత్సవం హెచ్ఎం జనార్దన్‌రెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్పీ సీఈవో జ్యోతి, ఏఎంవో విద్యాసాగర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలకు ప్రతిభను తెచ్చేది విద్యార్థులే అని, విద్యార్థులకు విలువలతో కూడిన నాణ్యమైన విద్య అందించాలని చెప్పారు. హెచ్ఎం జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడిని జయించి క్రమశిక్షణతో చదవాలన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈవో గోపాల్ నాయక్, ఏసీజీ రమేశ్‌శెట్టి, సెక్టోరియల్ అధికారులు నాగార్జునరెడ్డి, శ్రీనివాస్, పీఆర్‌టీయూ నాయకులు నర్సింహారెడ్డి ఉన్నారు.

బీజేపీ పాలనలో పేదలు అప్పులపాలు

- ఎమ్మెల్యేలు జీ.మధుసూదన్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి

రాజాపూర్ : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

అడ్డాకులలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

రాజాపూర్, ఏప్రిల్ 7: బీజేపీ పాలనలో దేశంలోని పేదలు అప్పుల ఊబిలో కూరుకుపోయారని, ప్రధాని మోదీ పేదల సొమ్మును కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, స్పోర్ట్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి విమర్శించారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని షాగార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఉమ్మడి బాలానగర్-రాజాపూర్ మండలాల కాంగ్రెస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించేందుకూ ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని చెప్పారు. ఎంపీగా వంశీచంద్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తే జడ్చర్ల నియోజకవర్గం రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కృష్ణయ్యయాదవ్, శంకర్‌నాయక్, ఆదిరమణరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, యాదయ్య, రమేశ్, నర్సింహులు, శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.

అడ్డాకులలో..

మూసాపేట(అడ్డాకుల), ఏప్రిల్ 7 : కార్యకర్తలు, నాయకుల సమిష్టి కృషితోనే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని దేవరకద్ర ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. అడ్డాకులలో మాతృశ్రీ పాఠశాలలో అడ్డాకుల, మూసాపేట మండలాలకు చెందిన పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్‌తోపాటు కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచందర్‌రెడ్డిలు పాల్గొని ప్రసంగించారు. డీకే అరుణకు మంత్రి పదవి ఇచ్చి రాష్ట్రంలోనే ఆమెకు గుర్తింపు ఇచ్చిన పార్టీపై, పార్టీ నేతలపై విమర్శలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగిరెడ్డి, కృష్ణయ్య, రామన్‌గౌడ్, శ్రీహరి, శేఖర్, విజయ్‌మోహన్‌రెడ్డి, భీమన్నయాదవ్, లింగారెడ్డి పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ : ముగ్గురికి గాయాలు

నుజ్జునుజ్జు అయిన ద్విచక్ర వాహనం

నారాయణపేటరూరల్, ఏప్రిల్ 7: పేట మండలంలోని సింగారం స్టేజీ సమీపంలోని భీమండికాలనీ వద్ద ఆదివారం మధ్యాహ్నం బైక్‌ను కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. ఎస్సై వెం కటేశ్వర్లు కథనం మేరకు.. పెద్ద జట్రం గ్రామానికి చెంది న యానగుంది సోమప్ప ఆయన భార్య, కూతురుతో కలిసి పేటలో ఉగాది పండుగ సామన్లు తీసుకొని, తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా భీమండి కాలనీ దగ్గరలో పేట వైపు వెళ్తున్న కారు డ్రైవర్ అతివేగంతో బైక్‌ను ఢీకొట్టడంతో ముగ్గురికీ గాయాలయ్యా యి. ఈ ఘటనపై సోమప్ప ఫిర్యాదు మేర కు కారు డ్రైవర్ సత్యనారాయణసింగ్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ఆరు గ్యారెంటీలు అమలయ్యే వరకు వెంటాడుతాం

- బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ

మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ

మక్తల్ టౌన్, ఏప్రిల్ 7 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసే వరకు కాంగ్రెస్‌ను వెంటాడుతూనే ఉంటామని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మాజీ ఎంపీపీ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండయ్య అధ్యక్షతన నిర్వహించిన మక్తల్ పట్టణ, మండల బూత్‌స్థాయి కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలుకాలేదని, మహిళలు కొట్టుకోవడానికే ఉచిత బస్సు ప్రయాణం పెట్టారని విమర్శించారు. దేశం కోసం జరుగుతున్న ఈ ఎన్నికల్లో మూడోసారి నరేంద్ర మోదీ ప్రధాని కావాలని దేశ ప్రజలంతా కోరుకుంటున్నారన్నారు. ప్రతి ఒక్కరూ కమలం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగురావు నామాజీ, శ్రీనివాసులు, కర్నిస్వామి, మున్సిపల్ చైర్‌పర్సన్ బాల్రేడ్ పావని, వైస్ చైర్‌పర్సన్ అఖిల, భాస్కర్ జి.బలరాంరెడ్డి, బి.రాజశేఖర్‌రెడ్డి, చిట్యాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తప్పనిసరి

నారాయణపేట, ఏప్రిల్ 7: ప్రతి ఒక్కరూ మెరుగైన జీవితం కోసం ఆరోగ్యంగా ఉండడం తప్పనిసరి అని సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జనరల్ దవాఖానలో జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్రజలు పనుల్లో బిజీగా గడుపుతూ ఆరోగ్యాన్ని విస్మరిస్తున్నారని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. మారుతున్న జీవనశైలి, మానసిక ఒత్తిడి, బిజీ జీవితం, ఆహారపు అలవాట్ల కారణంగా చాలామంది తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించలేకపోతున్నారన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని, సమయానికి భోజనం చేసి, తగినంత నిద్ర పోవాలని, ఒత్తిడి దరిచేరకుండా చూసుకోవాలన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేశ్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మీపతి గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, పావని, నర్సింహారావు పాల్గొన్నారు.

సేవ్ వాటర్.. సేవ్ లైఫ్

పాలమూర్, ఏప్రిల్ 7: జిల్లా కేంద్రంలోని బాలుర క్రీడా మైదానంలో ఆదివారం సుప్రభాతం హెల్త్ క్లబ్ కన్వీనర్ పాండురంగం ఆధ్వర్యంలో సేవ్ వాటర్, సేవ్ లైఫ్‌పై వాకర్స్‌కు అవగాహన కల్పించారు. నీటిని ఒడిసిపట్టి ప్రతి బొట్టును కాపాడుకుంటేనే సమాజంలో ప్రతి ప్రాణి బతుకుతుందని డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. వీరితో పాటు వెంకట్రామరెడ్డి, యాదిరెడ్డి, అనంత్‌రెడ్డి, శంకరయ్య పాల్గొన్నారు.

సేవ్ వాటర్‌పై అవగాహన కల్పిస్తున్న పాండురంగం

ముగిసిన పీవో, ఏపీవో శిక్షణ

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 7: మహబూబ్‌నగర్ జిల్లాలోని మూడు నియోజకవర్గాల పోలింగ్ అధికారులు పీవో, ఏపీవోలకు ఆదివారం శిక్షణ పూర్తయ్యిందని జిల్లా పోలింగ్ నోడల్ అధికారి శ్రీధర్ సుమన్ తెలిపారు. శిక్షణకు గైర్హాజరైన వారికి సోమవారం నిర్వహిస్తామని తెలిపారు. పోలింగ్ సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు.

పరీక్ష ఫీజు చెల్లింపునకు అవకాశం

పాలమూరు, ఏప్రిల్ 7: బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 2017కు ముందు డిగ్రీ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పిస్తున్నామని జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ సత్యనారాయణగౌడ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. పరీక్ష నిర్వహించే తేదీ, ఫీజు వివరాలు బీఆర్ యూనివర్సిటీ సైట్‌లో చూడాలని తెలిపారు.

విద్యుత్ వృథాను అరికట్టాలి

పగలే వెలుగుతున్న వీధి దీపాలు

కృష్ణ, ఏప్రిల్ 7: మండలంలోని గుడెబల్లూర్, ముడుమాల, మురహరిదొడ్డి తదితర గ్రామాల్లో వీధిదీపాలు నిరంతరం వెలుగుతున్నాయి. గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా విద్యుత్ వృథా కాకుండా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం

మూసాపేట, ఏప్రిల్ 7 : మండల కేంద్రంలోని రామస్వామి గుట్టపై ఉన్న రామలింగేశ్వరస్వామి ఆలయ పునర్ నిర్మాణానికి దాతలు ఆర్థిక సాయం అందజేశారు. ఆదివారం హైదరాబాద్ బీఎస్ఎన్ఎల్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు ఆలయ కమిటీ సభ్యులు అస్కని నరేందర్‌సాగర్, రాఘవేందర్‌రెడ్డిలకు ఆలయ నిర్మాణానికి రూ.51,116లు అందజేశారు. అదేవిధంగా చౌడపూర్ గ్రామానికి చెందిన వర్ధమాన్ ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ గందె సహస్ర రవికుమార్ రూ.21,116లు అందజేశారు.

17.4 లీటర్ల మద్యం పట్టివేత

పేట పట్టణ శివారులో పట్టుబడిన మద్యం

నారాయణపేట, ఏప్రిల్ 7: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఆదివారం పోలీసు లు తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని గుర్తించి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్సై వెంకటేశ్వర్లు కథ నం ప్రకారం.. నారాయణపే ట మండలం బొమ్మన్‌పాడ్ కు చెందిన కాశప్ప నారాయణపేట నుంచి బొమ్మన్‌పాడ్ గ్రామానికి 17.4 లీటర్ల మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పట్టణ శివారులో పట్టుకున్నారు. మద్యం విలువ రూ.5,800 ఉంటుందని ఎస్సై తెలిపారు. కాశప్పపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

గుండెపోటుతో బీఆర్ఎస్ కార్యకర్త మృతి

శివకుమార్

మిడ్జిల్, ఏప్రిల్ 7: మండలంలోని వాడ్యాల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త, యువకుడు శివకుమార్ గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. వాడ్యాల్ గ్రామానికి చెందిన తిరుపతయ్య చిన్న కుమారుడు శివకుమార్(26) మధ్యాహ్న సమయంలో ఇంట్లో ఉండగా ఫిట్స్‌తో పాటు గుండెనొప్పి రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే జడ్చర్ల దవాఖానకు తరలించారు. కానీ అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు.

'చేపల సుంకం రద్దు చేయాలి'

ధన్వాడ, ఏప్రిల్ 7: ఈ ఏడాది నీరు లేక చెరువులు ఎండిపోవడంతో చేపలు మృతిచెందాయని, దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈఏడాది చెరువుల సుంకం రద్దు చేయాలని నారాయణపేట జిల్లా మత్స్య సహకార సంఘం ఉపాధ్యక్షుడు నీరిటి నర్సింహులు నాయుడు ప్రభుత్వాన్ని కోరారు.

చేపల మృతితో మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

రైతులకు న్యాయం చేయాలి

మక్తల్ టౌన్, ఏప్రిల్ 7: తెలంగాణలో రైతు సంక్షేమం కోసం తక్షణమే మార్కెట్ కమిటీ పాలకవర్గాలను నియమించాలని రైతురాజ్యం పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎంబి. బాలకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మక్తల్‌లో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ యాసంగి పంటలు వరి, మొక్కజొన్న, వేరుశనగ, జొన్న, రాగులు మొదలగు పంటలు కోతకు వచ్చాయన్నారు. అసెంబ్లీ ఎలక్షన్లు అయి పోయి మూడు నెలలు గడిచాయి.. ఆగమేఘాల మీద 35 కార్పొరేషన్ చైర్మన్లను నియమించిన ప్రభుత్వం రై తు ప్రభుత్వం అని చెప్పుకునే ముఖ్యమంత్రి వ్యవసాయ మార్కెట్ కమిటీలను ఎందుకు నియమించలేదని ప్రశ్నించారు. మార్కెట్ కమిటీ పాలకవర్గం లేకపోతే మార్కెట్ యా ర్డులో రైతులకు న్యాయం ఏవిధంగా జరుగుతుందని ప్రశ్నించారు. రైతులకు గోనెసంచులు అందుబాటులో ఉంచాలని కోరారు.

జక్లేర్, గుడిగండ్లలో పోలీస్ కవాతు

మక్తల్ టౌన్, ఏప్రిల్ 7: మక్తల్ మండలంలోని సమస్యాత్మక గ్రామాలు జక్లేర్, గుడిగండ్లలో ఆదివారం సాయంత్రం పోలీసు, సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా మక్తల్ పట్టణ రెండో ఎస్సై ఆచారి, శ్రీనివాసులు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రజలకు భద్రత, భరోసా కల్పించడానికి కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించామన్నారు. పోలింగ్ సమయంలో అలజడి సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కేంద్ర బలగాలు, నర్వ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-311821-AII

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794